సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 7 । జూలై । 2023



గజ్వేల్‌లో సాధారణ పరిస్థితులు

గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. పట్టణంలో ఇప్పటికే పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చింది. 8లో..



సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట బైఠాయించారు. 9లో..

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాన్ని ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 7382929615 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

రేపు పుస్తక ఆవిష్కరణలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో ఈనెల 8న శ్రీనాథ కవి సార్వభౌముడు, బోగిమంటల సంక్రాంతి పుస్తకావిష్కరణలు చేయనున్నట్లు పుస్తక సంపాదకులు శ్రీచరణ్ సాయిదాస్ తెలిపారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు గురువారం సిద్దిపేటలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు వందమంది రచనలతో కూడిన పుస్తక సంకలనాలు ఆవిష్కరించుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ళ రాజేశం, మిట్టపల్లి పర్శరాములు, బెజుగాను శ్రీనివాస్, కోణం పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి



క్యాసారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏగొండస్వామి

గజ్వేల్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి క్యాసారంతో పాటు మండల పరిధిలోని అనంతరావుపల్లి, దాచారం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి



సిబ్బందిని సన్మానిస్తున్న డిపో మేనేజర్

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపోలో డ్రైవర్ ఎండీ బురాన్, కండక్టర్ పెంటయ్యతోపాటు సంక్రాంతి, దసరా చాలెంజ్‌లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన ఉద్యోగులు కేడి రెడ్డి, వలియొద్దీన్‌లను శాలువాతో సన్మానించి అభినందించారు.

పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా సీపీఎస్ ఉద్యమం

బెజ్జంకి(సిద్దిపేట): సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులను సమీకరించేందుకు ఆఫీస్ టూ ఆఫీస్ కార్యక్రమం చేపడుతున్నట్లు టీసీపీఎస్ఈఏ(తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆందోళనలు, వినతి పత్రాలిచ్చినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆగస్టు 5వ తేదీన సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కుటుంబాలతో కలిసి ఇందిరా పార్క్ వద్ద ఒక్కరోజు నిరసన దీక్ష చేపడుతామన్నారు.

సంక్రమణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ రమేశ్‌బాబు

సిద్దిపేట ఎడ్యుకేషన్: వన్యప్రాణుల ద్వారా సంక్రమించే వైరస్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్‌బాబు సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో జంతు, మత్స్యశాస్త్ర విభాగాధిపతి, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జునోసిస్ అనగా వన్య ప్రాణుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధులు అని అర్థమన్నారు. మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్, ఎబోలా, సార్స్, బర్డ్‌ఫ్లూ తదితర వ్యాధులు జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులే అని వివరించారు. వీటి గురించి అవగాహన కల్పించడానికి ప్రతీ సంవత్సరం జూలై 6న జునోటిక్ వ్యాధుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ విశ్వనాథం, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ పుణ్యమ్మ పాల్గొన్నారు.

బ్లాక్‌లిస్ట్ ఫోబియా

- రైస్ మిల్లుల్లో నిల్వలపై సివిల్, రెవెన్యూ అధికారుల ఫిజికల్ వెరిఫికేషన్
- జిల్లావ్యాప్తంగా మిల్లర్ల వద్ద నిల్వలు 4.40 లక్షల మెట్రిక్ టన్నులు
- వ్యత్యాస బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరికలు
- హుస్నాబాద్ ఘటనతో 5 నుంచి జిల్లావ్యాప్తంగా తనిఖీలు
- ఆందోళనలో యజమానులు



దుద్దెడలో సురభి రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లయి అధికారులు

సాక్షి, సిద్దిపేట: మిల్లుకు కేటాయించిన ధాన్యం నిల్వలున్నాయా? లేవా? అని క్షేత్రస్థాయిలో అధికారులు ఫిజికల్ వెరిఫికేషన్ చేస్తున్నారు. ఇటీవల హుస్నాబాద్‌లో ఏఆర్‌ఎం ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లులో రూ 27.76కోట్ల విలువ చేసే 9,522 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు విజిలెన్స్ ఆకస్మిక తనిఖీల్లో వెలుగుచూసింది. ఇలా ఇతర జిల్లాల్లో సైతం ధాన్యం మాయమైన సంఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి మూడునెలలకోసారి ఫిజికల్ వెరిఫికేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఈ నెల 5 నుంచి జిల్లావ్యాప్తంగా సివిల్ సప్లయి అధికారులు, తహసీల్దార్‌లు ఫిజికల్ వెరిఫికేషన్ చేస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన నిల్వల కంటే తక్కువ ఉన్న రైస్ మిల్లుల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

మిల్లర్ల వద్ద 4.40 లక్షల టన్నుల బియ్యం

వడ్లు కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ప్రభుత్వం కొంటోంది. ఈ వడ్లను మరాడించి బియ్యంగా మార్చేందుకు రైస్ మిల్లులకు సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ బియ్యం) కింద అప్పగిస్తారు. క్వింటాల్ వడ్లకు 67 కేజీల చొప్పున బియ్యాన్ని అందించాల్సి ఉంటుంది.

- జిల్లాలో 140 రైస్ మిల్లులున్నాయి. ప్రతి ఏటా సీఎంఆర్ కింద వడ్లను అప్పగిస్తున్నారు. 2021-22 యాసంగి నుంచి 2022-23 యాసంగి వరకు అంటే మూడు సీజన్‌లకు గాను మొత్తంగా 7,25,072 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. ఇప్పటి వరకు 2,84,252 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అప్పగించగా ఇంకా మిల్లర్లు 4,40,819 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాలి.
- ఎక్కువ మొత్తంలో బ్యాలెన్స్ ఉన్న మిల్లులను అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అందించాల్సిన బియ్యం కంటే తక్కువ ఉంటే చర్యలు తీసుకోనున్నారు. దీంతో పలు మిల్లుల్లో తక్కువ ధాన్యం ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. ధాన్యం తక్కువ నిల్వ ఉంటే బ్లాక్ లిస్ట్‌లో పెడతారని రైస్‌ను సమకూర్చే పనిలో పడ్డారని తెలిసింది.
- అయితే ఎఫ్‌సీఐ (ఫుడ్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) వారు త్వరగా నిల్వలు తీసుకునేలా కృషి చేయాలని, వీటి గోదాంలు నిండిపోవడంతో రోజుల తరబడి లారీలు అక్కడే వేచిచూడాల్సి వస్తోందని తనిఖీలకు వెళ్లిన అధికారుల ఎదుట మిల్లర్లు మొర పెట్టుకుంటున్నారు.

ధాన్యం వివరాలు (టన్నుల్లో)

సంవత్సరం	సీఎంఆర్	టార్గెట్	డెలివరీ	బ్యాలెన్స్
2021-22	యాసంగి	2,45,091	2,35,619	9,471
2022-23	వానాకాలం	2,42,994	41,586	2,01,408
2022-23	యాసంగి	2,36,987	7,047	2,29,940

తనిఖీలు చేస్తున్నాం

రైస్ మిల్లుల్లో ఫిజికల్ వెరిఫికేషన్ చేస్తున్నాం. సివిల్ సప్లయి అధికారులతో పాటు స్థానిక తహసీల్దార్‌లు సైతం తనిఖీలు చేస్తున్నారు. 30 శాతం మిల్లుల్లో తనిఖీ చేసి రిపోర్టు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

–హరీశ్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

ఇళ్లు కోల్పోయే వారి వివరాలు సేకరించాలి

మెదక్–ఎల్కతుర్తి ఫోర్‌లేన్ హైవే పనులపై కలెక్టర్ సమీక్ష

సిద్దిపేటరూరల్: మెదక్–ఎల్కతుర్తి ఫోర్ లేన్ రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న వారి వివరాలు సేకరించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్– ఎల్కతుర్తి ఫోర్ లేన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ రహదారి గ్రామాల మీదుగా వెళ్లినప్పుడు ఇళ్లు, ఇతర నిర్మాణాలను ప్రజలు కోల్పోతున్నారన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించి వివరాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఇఇ రాము, అధికారులు మనోహర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవితాంతం రుణపడి ఉంటాం

సిద్దిపేటజోన్: కుమ్మరుల జీవనోపాధి కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ప్రాజెక్టు కోసం రూ.2.20కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు జీవితాంతం రుణపడి ఉంటామని కుమ్మరి సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మంత్రి చేతుల మీద జీవో పత్రాన్ని అందుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని కుమ్మరుల కోసం కేసీఆర్ నగర్ శివార్లలో రెండు ఎకరాల స్థలంలో మట్టి వంట పాత్రలు, వివిధ రకాల గ్లాసుల తయారీ ప్రాజెక్టును నిర్మించనున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రతినిధులు తిరుపతి, రవీందర్ తదితరులు ఉన్నారు.



కుమ్మర్లకు జీఓ పత్రాలు అందిస్తున్న మంత్రి హరీశ్ రావు

మంత్రి కేటీఆర్ హామీలు నెరవేర్చాలి

చేర్యాల(సిద్దిపేట): మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ కోరారు. గురువారం పట్టణంలోని గౌడ సంఘం కార్యాలయంలో గుడాల గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కల్లు గీత కార్మికులు, గౌడ కులస్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీనివాస్, రాజు, రాజయ్య, కనకయ్య, అజయ్, శేఖర్, మల్లేశం, శ్రీహరి, కృష్ణమూర్తి, బాలయ్య, బాల్‌రాజు, నర్సింహులు, పర్శరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణ్

కనీస వేతన చట్టం అమలు చేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారి డిమాండ్ చేశారు. జీవో నెం.60 ప్రకారం కనీస వేతనాలు పెంచాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం నిరవధిక సమ్మెకు దిగారు. దీనికి ఇస్తారి సంఘీభావం తెలిపి మాట్లాడారు. 8 గంటల పని దినాలు అమలు చేసి వారాంతపు సెలవులు మంజూరు చేయాలన్నారు. కార్మికుల అక్రమ తొలగింపులు నిలిపి వేయాలని, సరిపడా యూనిఫాంలు అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో పరుశరాములు, సార్ల శ్రీనివాస్, సాయిలు, రాజలింగ, లక్ష్మయ్య, ఉప్పలవ్వ, మల్లేశం, యాదగిరి, నర్సింహులు, పుష్ప, కళ పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న తేలు ఇస్తారి

ఆధునిక పద్ధతులతో లాభాలు

ములుగు(గజ్వేల్): ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా ఉద్యాన పంటలను సాగు చేసి లాభాలు పొందవచ్చని హైదరాబాద్ ధన్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ దినకర్ అన్నారు. గురువారం ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆధునిక సాగు పద్ధతులు, అధిక దిగిబడి సాధనకు చేపట్టాల్సిన విధానాల గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. ఆయిల్‌పాం పంట సాగులో అంతర పంటల సాగు, సమగ్ర వ్యవసాయంలో మెలకువలు, ఉద్యాన పంటల సాగులో సోలార్ పానెల్స్ యొక్క ఆవశ్యకత తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.నీరజప్రభాకర్, రాజశేఖర్, నటరాజన్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రదీప్ దినకర్

దళితులపై కుల వివక్ష అమానుషం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రత్యేక రాష్ట్రంలో దళితుల పట్ల అంటరానితనం, కుల వివక్ష కొనసాగడం అమానుషమని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో దళితుల పట్ల వివక్ష చూపుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దళితులను హనుమాన్ దేవాలయంలోకి రానివ్వకపోవడం, దశాబ్ది ఉత్సవాల్లో వివక్ష చూపడం వెనుక ఆధిపత్య కులాల కుట్ర ఉందన్నారు. గ్రామంలో అంటరానితనం పాటిస్తున్న వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, సీపీ గ్రామాన్ని సందర్శించి సహపంక్తి భోజనం, దేవాలయ ప్రవేశం, అందరితో పాటు దళితులకు క్షవరం చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణమూర్తిని కలిసి ఫిర్యాదు చేశారు. సీఐ మాట్లాడుతూ తిమ్మాపూర్ ఘటనపై కేసు నమోదు చేశామని, గ్రామంలో విచారణ చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్, బీఎస్పీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

త్వరలో రోడ్డు పనులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వట్టిపల్లి డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్ అన్నారు. మండలంలోని వట్టిపల్లి, సాల్వాపూర్ రోడ్డుకు ఇటీవల రూ.8 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. గురువారం అధికారుల బృందం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సరిహద్దు గ్రామమైన వట్టిపల్లి నుంచి యాదాద్రి జిల్లా సాల్వాపూర్ శివారు వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్‌రోడ్డుగా చేయడానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ వసంతనాయక్, ఈఈ బాలప్రసాద్, డీఈ వెంకటేశం, ఏఈ ధన్‌రాజ్, గ్రామ సర్పంచ్ రజితరాజేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాములు, సత్యనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

శ్మశానవాటిక కూల్చడం దుర్మార్గం

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): శ్మశాన వాటిక, డంప్‌యార్డును కూల్చివేయడం దుర్మార్గపు చర్య అని, వాటిని వేరేచోట నిర్మించాలని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని తుక్కాపూర్‌లో మల్లన్న సాగర్ అధికారులు రెండు రోజుల క్రితం కూల్చివేసిన వాటిని ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్న సాగర్ కోసం భూమి అప్పగించిన సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. తుక్కాపూర్ గ్రామాన్ని మరోచోట నిర్మిస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదన్నారు. సబ్ స్టేషన్ నిర్మిస్తే తుక్కాపూర్ గ్రామస్తులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు దారిలేకుండా పోతోందన్నారు. కాగా, కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమస్య విన్నవించేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించగా అధికారులు స్పందించలేదు. దీంతో గ్రామస్తులను తీసుకుని కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రం, శ్రీలతస్వామి, విభీషన్‌రెడ్డి, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.



కూల్చివేసిన శ్మశాన వాటిక, డంప్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేటరూరల్: తుక్కాపూర్ గ్రామస్తుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను కోరారు. తుక్కాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం శ్మశాన వాటిక, డంపింగ్ యార్డును కూల్చివేయడంపై ఎమ్మెల్యే స్పందించారు. గురువారం గ్రామస్తులతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. కూల్చివేసిన శ్మశాన వాటి, డంపింగ్ యార్డ్‌ను వేరేచోట నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

నిర్లక్ష్యంలో వైద్యాధికారులు



మీటింగ్‌లో కింద కూర్చున్న ఆశ కార్యకర్తలు

హుస్నాబాద్: ప్రభుత్వ వైద్యాధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అక్కన్నపేట, మీర్జాపూర్, రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించాల్సిన మంత్రి హరీశ్‌రావు రివ్యూ మీటింగ్‌ను హుస్నాబాద్‌లోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో నిర్వహించడమేమిటని ప్రశించారు. అంతేకాకుండా మీటింగ్‌లో అధికారులు కుర్చీలో కూర్చొని, ఆశ కార్యకర్తలను నేలకు పరిమితం చేయడం సరికాదన్నారు.

వైభవంగా శ్రవణ నక్షత్ర మహోత్సవం



సామూహిక తులసీదళ నామార్చనలో వేదవిద్యార్థులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరాలయంలో గురువారం శ్రవణ నక్షత్ర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో వేదపండితులు శనగల నాగరాజుశర్మ పరివారం తెల్లవారుజామున స్వామివారికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరునికి అలంకార సేవ చేశారు. వేదపండితుల నామార్చనల మధ్య వేద విద్యార్థులు, భక్తజనుల సామూహిక లక్ష తులసి దళార్చన ఆద్యంతం నేత్ర పర్వంగా సాగింది.



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ముచ్చటగా మూడు

ఉమ్మడి జిల్లాను వరించిన నామినేటెడ్ పదవులు



భూపాల్‌రెడ్డి
రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్



మఠం భిక్షపతి
రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్



తన్వీర్
రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నామినేటెడ్ పదవుల నియామకాల్లో సంగారెడ్డి జిల్లాకు ప్రత్యేక స్థానం దక్కింది. జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు వరించాయి.

- మాజీ ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డి తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన భూపాల్‌రెడ్డి మండలి మాజీ ప్రొటెం చైర్మన్‌గా కూడా పని చేశారు. ఎమ్మెల్సీ పదవీకాలం కొద్ది నెలల క్రితమే ముగిసింది. ఇప్పుడు ఆయనకు కార్పొరేషన్ పదవిని ప్రభుత్వం కట్టబెట్టింది.

వట్‌పల్లి: ఆందోల్ నియోజకవర్గానికి చెందిన మఠం భిక్షపతికి నామినేట్ పదవి వరించింది. తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన నియమితులయ్యారు.

- భిక్షపతి భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ తరపున 2014లో మర్వెల్లి ఎంపీటీసీ స్థానానికి పోటీ చేసి అల్లాదుర్గం మండల వైస్ ఎంపీపీగా పనిచేశారు.
- అందోలు అసెంబ్లీ స్థానానికి జరిగిన 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు. రెండేళ్ల క్రితం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మెంబర్‌గా ఎంపికయ్యారు.
- ఉద్యమంలో కీలకంగా వ్యవహరించడం, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయడంతో సీఎం కేసీఆర్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా భిక్షపతిని నియమించారు.

జహీరాబాద్: రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా జహీరాబాద్‌కు చెందిన ఎండీ.తన్వీర్ నియమితులయ్యారు. ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్ కుమారుడైన తన్వీర్ ప్రస్తుతం మైనార్టీ కార్పొరేషన్ సభ్యులుగా ఉన్నారు.

- ఫరీదుద్దీన్ జహీరాబాద్ నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు.
- జహీరాబాద్ అసెంబ్లీ స్థానం ఎస్సీలకు రిజర్వు కావడంతో గీతారెడ్డి పోటీచేసి గెలుపొందారు.
- దీంతో కాంగ్రెస్‌లో సముచిత గౌరవం లభించడం లేదని అసంతృప్తితో ఉన్న ఫరీదుద్దీన్‌ను సీఎం కేసీఆర్ టీఆర్ఎస్‌లోకి ఆహ్వానించి ఎమ్మెల్సీగా సముచిత స్థానం కల్పించారు.
- గతేడాది ఫరీదుద్దీన్ అనారోగ్యంతో మరణించడంతో జిల్లాలో మైనార్టీ నాయకుడు లేకుండా పోయారు. ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు ఫరీదుద్దీన్ కుమారుడు ఎండీ.తన్వీర్‌కు ఇటీవల మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చారు.
- తాజాగా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవిని కేటాయించారు.
- జహీరాబాద్ నియోజకవర్గంలో మైనార్టీలు అధికంగా ఉండడం కూడా తన్వీర్‌కు కార్పొరేషన్ పదవి రావడానికి కారణంగా పలువురు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

దోసె లేదన్నందుకు దాడికి యత్నం

రామాయంపేట(మెదక్): టిఫిన్ సెంటర్లో దోసె లేదన్నందుకు ఆగ్రహించిన ఒక యువకుడు హోటల్ యజమానిపై కొడవలితో దాడికి యత్నించాడు. ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ కాలనీకి చెందిన మెట్టు స్వామి ఓ హోటల్కు వెళ్లి దోసె అడగగా పిండి అయిపోయిందని యజమాని వీరమణి చెప్పింది. దీంతో ఆగ్రహించిన స్వామి అందరికీ టిఫిన్ ఇచ్చావని తనకెందుకు లేదన్నావని ఆమెతో గొడవకు దిగాడు. అనంతరం కొడవలితో దాడికి యత్నించగా ఆమె ప్రతిఘటించింది. ఈ ఘటనలో వీరమణితోపాటు ఆమె కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్తో తొక్కించి..


సీజ్ చేసిన ట్రాక్టర్

దుబ్బాకరూరల్: పాత కక్ష్యలు దృష్టిలో పెట్టుకుని ట్రాక్టర్తో తొక్కించిన సంఘటన భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్లో జరిగింది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 3వ తేదీన గ్రామానికి చెందిన ఎర్రోళ్ల ఎల్లయ్య తన ఇంటి వద్ద రోడ్డు ప్రక్కన నిలబడి ఉన్నాడు. ఆవైపుగా ట్రాక్టర్పై వస్తున్న అదే గ్రామానికి చెందిన జిగిరి స్వామి తన ట్రాక్టర్తో ఎల్లయ్య పైకి ఎక్కించాడు. ఈ ఘటనలో ఎల్లయ్యకు తీవ్రగాయాలవడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుని కోడలు కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాల్కు జరిమానా

సిద్దిపేటజోన్: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. గురువారం మెదక్ రోడ్డు పక్కన ఉండే ప్రముఖ మాల్లో చెత్త పెద్ద ఎత్తున ఉండడంతో శానిటరీ ఇన్స్పెక్టర్ వనిత మాల్ నిర్వాహకులకు రూ.16 వేలు జరిమానా విధించారు.

ముగ్గురి అదృశ్యం

పటాన్చెరులో వృద్ధుడు, మజీద్పల్లిలో తల్లీ, కూతురు అదృశ్యమయ్యారు.


రామ్హర్ష (ఫైల్)

పటాన్చెరు టౌన్: వృద్ధుడు అదృశ్యమైన సంఘటన పటాన్చెరు పోలీస్స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ మొహ్మద్ అలీ వివరాల ప్రకారం..పట్టణంలోని జేపీ కాలనీకి చెందిన రామ్ హర్ష(65) రెండు సంవత్సరాలుగా యూరిన్ ఇన్ఫెక్షన్తో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు వైద్యం చేయించడంతో అతను మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో జూన్ 25వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామ్హర్ష తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి అదృశ్యంపై అశోక్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీ, కూతురు..


తల్లీ, కూతురు (ఫైల్)

తూప్రాన్: తల్లీ, కూతురు అదృశ్యమైన సంఘటన పట్టణ కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఎస్ఐ సురేశ్కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన మజీద్పల్లి సురేశ్కు భార్య అమృత(27), కూతురు రూపశ్రీ(4) ఉన్నారు. జూన్ 14న భార్యాభర్తల మధ్య ఆర్థిక ఇబ్బందుల కారణంగా గొడవ పడ్డారు. ఈ క్రమంలో తెల్లవారు జామున భార్య అమృత, కూతురు రూపశ్రీ కనిపించకుండ పోయారన్నారు. భార్య, కూతురు కోసం చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గజ్వేల్లో సాధారణ పరిస్థితులు

- కొనసాగుతున్న తనిఖీలు
- ఉద్రిక్తత కారకులపై ప్రత్యేక బృందాలతో విచారణ



గజ్వేల్లోని ఇందిరాపార్కు వద్ద కొనసాగుతున్న పికెటింగ్

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. పట్టణంలో ఇప్పటికే పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చింది. సాధారణ వాతావరణం నెలకొంది. గురువారం కూడా పోలీస్ చెక్పోస్టులు, పికెటింగ్ కొనసాగించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. నిన్నటిలాగే మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తా, తూప్రాన్ రోడ్డు, వై జంక్షన్ వద్ద చెక్పోస్టులను ఏర్పాటు చేసి అనుమానితులను విచారిస్తున్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పట్టణంలోకి అనుమతిస్తున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్పల్లి, సంగాపూర్, పిడిచెడ్, కోటమైసమ్మ రోడ్లపై పికెటింగ్ కొనసాగుతుంది. పట్టణంలో సిటీ పోలీస్ యాక్టును యథాతథంగా అమలు చేస్తున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలపై నిషేధం కొనసాగుతున్నాయి. సమస్యాత్మకంగా భావిస్తున్న మార్గాలను మూసేశారు. స్థానిక ఏసీపీ రమేశ్, సీఐ వీరప్రసాద్లు చెక్పోస్టులు, పికెటింగ్లను పరిశీలిస్తూ పోలీసులకు సూచనలు చేస్తున్నారు. అనుమతి లేకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని కూడా ఆదేశాలిచ్చారు.

ప్రత్యేక బృందాలతో విచారణ : సిద్దిపేట సీపీ శ్వేత

గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలకు కారణమైన వారిపై ప్రత్యేక బృందాలతో విచారణ చేస్తున్నాం. సీసీ కెమెరాలతో ఆధారాలను సేకరించిన తర్వాతే అరెస్టు చేస్తున్నట్లు సీపీ శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతలను కాపాడే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నిందితులు ఎంతటివారైనా సరే వదిలిపెట్టబోమన్నారు. ప్రతీ కేసు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పరిశోధన జరుపుతున్నామని వెల్లడించారు. ప్రస్తుతం గజ్వేల్లో ప్రశాంత వాతావరణం నెలకొందని, దీన్ని కొనసాగించడానికి అందరూ సహకరించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే పోస్టింగులు పెడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

మరో ఆరుగురి అరెస్ట్, రిమాండ్

ఈ నెల 3, 4 తేదీల్లో పట్టణంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలకు కారణమైన మరో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు పంపారు. ఇందులో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్పల్లికి చెందిన దేవులపల్లి మనోహర్యాదవ్, గజ్వేల్ పట్టణంలోని భారత్నగర్కు చెందిన కైలాస శ్రీకాంత్, రాయపోల్ మండలం టెంకంపేట గ్రామానికి చెందిన అంతన్నగారి గణేష్, గజ్వేల్ పట్టణానికి చెందిన గంగిశెట్టి రవీందర్, సుంకరి బాల్కుమార్, పిట్ల కుమార్ అలియాస్ డీజే కుమార్లు ఉన్నారు. దీంతో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 17కు చేరింది.

పెళ్లి కోసం ఐడీ నమోదు చేసి..
సైబర్ వలలో చిక్కి..

రూ.3.73లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్వేర్ ఉద్యోగి



పటాన్చెరు టౌన్: పెళ్లి కోసం ఆన్లైన్లో ఐడిని క్రియేట్ చేసి సైబర్ వలలో చిక్కి ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి మోసపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్పూర్ పరిధిలోని లక్ష్మీ హోమ్స్కు చెందిన ఓ సాఫ్ట్వేర్ ఉద్యోగి ఆన్లైన్లో పెళ్లి కోసమని ఓ సైట్ లో తన వివరాలతో ఐడిని నమోదు చేసుకున్నాడు. ఈ క్రమంలో అతడి ఐడీకి యువతి నుంచి రిక్వెస్ట్ వచ్చింది. ఆ మెసెజ్కి యాక్సెప్ట్ చేసి యువతి చెప్పినట్లు సాఫ్ట్వేర్ ఉద్యోగి టెలిగ్రామ్ ద్వారా చాటింగ్ చేశాడు. ఈ క్రమంలో జూన్ 14వ తేదీన యువతి ఉద్యోగికి ఫోన్ చేసింది. తన తల్లికి రోడ్డు ప్రమాదం జరిగిందని, అత్యవసరంగా రూ.3,73,000లు ఆన్లైన్లో పంపమని కోరింది. దీంతో అతను ఆమె అడిగిన విధంగా డబ్బులను పంపాడు. కాగా ఆ యువతిని కలుద్దామని ఉద్యోగి అడగడంతో యువతి నుంచి స్పందన లేదు. దీంతో ఆ ఉద్యోగి మోసపోయినట్లుగా గుర్తించి చేసేదేమి లేక సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో సాఫ్ట్వేర్ ఉద్యోగిని..

పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ వచ్చిన మెసేజ్కు స్పందించి ఓ సాఫ్ట్వేర్ ఉద్యోగిని రూ.3లక్షలు పోగొట్టుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్పూర్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగిని జూన్ 13వ తేదీన పార్ట్ టైం జాబ్ ఆఫర్ అనే మెసేజ్కి స్పందించింది. దీంతో ఆమె తన వివరాలను నమోదు చేసింది. గుర్తు తెలియని వ్యక్తి చెప్పినట్టుగా నగదు ఇన్వెస్ట్ చేసి ఇచ్చిన టాస్కులు పూర్తి చేసింది. చివరికి తను పెట్టిన నగదు రూ.3లక్షలతో పాటు రెట్టింపు నగదు కోరడంతో గుర్తు తెలియని వ్యక్తి నుంచి స్పందన లేదు. దీంతో ఆ ఉద్యోగిని మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అనంతరం అమీన్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సిద్దిపేట కమాన్లో..

సిద్దిపేట కమాన్: పార్ట్ టైం జాబ్ పేరిట గురువారం సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు సైబర్ మోసాలకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఓ బాధితుని బ్యాంక్ ఖాతా నుంచి అతని ప్రమేయం లేకుండానే రూ.49,999లు డెబిట్ కాగా సకాలంలో స్పందించి బాధితుడు జాతీయ సైబర్ సెల్కు ఫిర్యాదు చేయడంతో ఆ డబ్బులు ఫ్రిజ్ అయ్యాయి. మరో బాధితుడికి టెలీగ్రామ్ యాప్లో పార్ట్ టైం జాబ్ ఉందని ఆ నెంబర్ను బాధితుడు సంప్రదించాడు. వివిధ టాస్కుల తర్వాత సైబర్ మోసగాడి మాటలను నమ్మి బాధితుడు రూ.64,132లు గూగుల్ పే ద్వారా పంపించాడు. అనుమానం వచ్చి జాతీయ సైబర్ సెల్కు ఫిర్యాదు చేయగా సైబర్ మోసగాడి ఖాతాలో రూ.11వేలను ఫ్రిజ్ చేశారు. ఇదే తరహాలో పార్ట్ టైం జాబ్ ఉందని నమ్మిన మరో బాధితుడు రూ.29వేలు పంపించాడు. లింక్ అనుమానంగా ఉండడంతో సైబర్ సెల్ను బాధితుడు ఆశ్రయించాడు. సైబర్ మోసగాని ఖాతాలో ఉన్న రూ.2వేలను ఫ్రిజ్ చేశారు. అదేవిధంగా మరో బాధితురాలికి ఎస్బీఐ బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నట్టు సైబర్ మోసగాడు ఫోన్ చేసి, క్రెడిట్ కార్డ్ చార్జి రూ.2,500 వచ్చేలా చూస్తానని, క్రెడిట్ కార్డ్ వివరాలు, ఓటిపి తెలుసుకొని ఖాతా నుంచి రూ.90,994డెబిట్ చేశాడు. బాధితురాలు జాతీయ సైబర్ సెల్కు ఫిర్యాదు చేసింది.

టూ టౌన్ పరిధిలో..

ఓ బాధితుడు ఒక యాప్లో పెట్టుబడి పెట్టాడు. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు నగదు ఆశచూపడంతో అది నమ్మిన అతను రూ.25వేలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు.

వన్ టౌన్ పరిధిలో..

ఓ బాధితునికి లాభాలు వస్తాయని ఆశ చూపడంతో వాట్సాప్ లింక్ ఓపెన్ చేసి రూ.15వేలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. వెంటనే జాతీయ సైబర్ సెల్కు ఫిర్యాదు చేయగా, సైబర్ మోసగాడి ఖాతా నుంచి రూ.5వేలు ఫ్రిజ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, ఫోన్కు వచ్చే వివిధ లింక్లను ఓపెన్ చేయొద్దని పోలీస్ కమిషనర్ శ్వేత సూచించారు

నాచగిరి ఆర్యవైశ్య సత్రం చైర్మన్
బాలాజీ కన్నుమూత

ముగిసిన అంత్యక్రియలు


బాలాజీ గుప్తా (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వర్గల్ మండలం నాచగిరిలో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి నిత్యాన్నదాన సత్రం చైర్మన్ చిట్టిమల్ల బాలాజీ గుప్తా(70) గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. మాసాయిపేటకు చెందిన బాలాజీకి భార్య భారతమ్మ ఉన్నారు. దశాబ్ద నుంచి బాలాజీ దంపతులు సత్రంలోనే ఉండి సేవలందిస్తున్నారు. సంఘ సేవ, దాతృత్వం, వృద్ధులకు ఆసరాగా నిలుస్తూ, అనాథల అపరకర్మల కోసం ప్రత్యేకంగా అంత్యేష్ఠి భవనం దాతల సహకారంతో నిర్మింపజేశారు. సత్రం చైర్మన్గా కొనసాగుతున్న ఆయన అన్ని వర్గాల ప్రజల ఆదరణ చూరగొన్నారు. గురువారం సత్రంలోనే అనారోగ్యానికి గురై మృతిచెందినట్లు సత్రం వర్గాలు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, రామాయంపేట మాజీ ఎమ్మెల్యే విఠల్రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి నివాళులర్పించారు. కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఆర్యవైశ్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బచ్చు పాండురంగ, కొండపోచమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్ గోలి సంతోష్, నాచగిరి మాజీ ధర్మకర్త నంగునూరి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘ నేతలు కొమురవెల్లి శంకరయ్య, సత్యనారాయణ గుప్తా రాత్రి జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సేవాభావం, దాతృత్వ కార్యక్రమాలతో అందరి ఆదరణ చూరగొన్న బాలాజీ మృతి విచారకరమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఆయన చేసిన సేవా కార్యక్రమాలు, దాతృత్వం దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్కు చెందిన ఓ ప్రముఖ సంస్థ బాలాజీగుప్తకు డాక్టరేట్ ప్రదానం చేసిందని గుర్తుచేసుకున్నారు.


కుటుంబీకులను పరామర్శిస్తున్న ప్రతాప్రెడ్డి తదితరులు

అర్హులైన నిరుపేదలకే సంక్షేమ పథకాలు

- లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయండి
- ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు కలెక్టర్లతో మంత్రి హరీశ్ సమీక్ష


మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన నిరుపేదలకు అందేలా చూడాలని మంత్రి హరీశ్రావు పేర్కొన్నారు. ఆయా పథకాలకు సంబంధించి నియోజకవర్గ స్థాయిలో లబ్ధిదారులు ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురువారం రాత్రి ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్డీఓలతో హరీశ్రావు ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా పథకాల అమలులో ఉమ్మడి జిల్లా ముందుండాలని స్పష్టం చేశారు. దళిత బంధు పథకం ఒక సామాజిక విప్లవమన్నారు. బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం, గృహ లక్ష్మి, ఇళ్ల స్థలాల పంపిణీ, గొర్రెల పంపిణీ, వికలాంగుల పెన్షన్, కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ వంటి పథకాల అమలులో జిల్లాల పనితీరుపై మంత్రి హరీశ్రావు పలు సూచనలు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధికి కోసం చేసిన విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు స్వీకరించి వాటిని పూర్తి చేసిన మంత్రికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీలు బీబీ పాటిల్, కొత్త ప్రభాకర్రెడ్డి, ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, క్రాంతికిరణ్, మదన్ రెడ్డి, మాణిక్ రావు, పద్మాదేవేందర్ రెడ్డి , ముత్తిరెడ్డి యాదగిరి, సతీష్బాబు, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, సుభాష్ రెడ్డి, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కలెక్టర్లు శరత్, ప్రశాంత్ పాటిల్, రాజర్షిషా తదితరులు పాల్గొన్నారు.

పరేషాన్ వద్దు.. పట్టాలు అందిస్తాం


రైతులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

జగదేవ్పూర్(గజ్వేల్): అంతాయిగూడ గ్రామంలో భూ సమస్యలు పరిష్కరించి త్వరలోనే పట్టాలు అందిస్తామని, ఎవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్డీసీ చైర్మన్ ప్రతాప్రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మండలం కార్యాలయంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంతాయిగూడ గ్రామంలో భూ సమస్యను మంత్రి హరీశ్రావు, కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, ఎంపీపీ బాలేషంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ములుగు(గజ్వేల్): రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్డీసీ వంటేరు ప్రతాప్రెడ్డి పేర్కొన్నారు. ములుగులోని తెలంగాణ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ పనుల కోసం అల్లీనగర్ రైతుల నుంచి సేకరించిన భూమికి పరిహారం చెక్కులను గురువారం ములుగు రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ దేవేందర్రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

అదుపులో నిందితులు

జగదేవ్పూర్(గజ్వేల్): ఏడు కిలోల ఎండు గంజాయిని పట్టుకున్న సంఘటన గోపాల్పూర్లో చోటుచేసుకుంది. ఎక్సైజ్శాఖ ఇన్స్పెక్టర్ బ్రహ్మానందరెడ్డి గురువారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జగదేవ్పూర్ మండలంలోని గోపాల్పూర్లో బుధవారం రాత్రి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్శాఖ అధికారి శ్రీనివాస్మూర్తి ఆదేశాల మేర గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. దీంతో అక్కిరాజు భాస్కర్ ఇంట్లో 7కిలోల ఎండు గంజాయి దొరికిందన్నారు. వెంటనే నిందితుణ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో మరో వ్యక్తి గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన నగేష్ను పట్టుకున్నట్లు వారు పేర్కొన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ నర్సింలు, కరుణాకర్, రేణుక పాల్గొన్నారు.


పట్టుబడిన నిందితులతో పోలీసులు

విద్యుదాఘాతంతో పాడి పశువులు మృతి


మృతి చెందిన గేదెలు, దూడ

సిద్దిపేటఅర్బన్: విద్యుదాఘాతంతో రెండు గేదెలు, ఒక దూడ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పొన్నాల గ్రామంలో గురువారం జరిగింది. బాధిత రైతు బర్ల మల్లేశం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తనకున్న రెండు గేదెలను, దూడను పొలం వద్ద ఉదయం మేత కోసం వదిలిపెట్టాడు. అవి మేత మేసుకుంటూ సమీపంలోని కుంట వద్దకు నీళ్ల తాగడానికని వెళ్లాయి. కుంట పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలు తాకి అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనలో రైతు మల్లేశం, కుటుంబ సభ్యులు కంట తడి పెట్టుకున్నారు. మృతి చెందిన గేదెలు, దూడ విలువ సుమారు రూ. 2 లక్షల వరకు ఉంటుందని బోరున విలపించాడు. అతణ్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ రేణుక శ్రీనివాస్, ఎంపీటీసీ మమతయాదగిరి కోరారు.

అన్నదమ్ములపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): భూతగదాలతో గొడవపడిన అన్నదమ్ములపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికాంతారావు గురువారం తెలిపారు. మండల పరిధి భీమ్లా పంచాయతీకి చెందిన కాట్రావత్ క్రిష్ణ, కాట్రావత్ సోములు అనే ఇద్దరు అన్నదమ్ములు రెండు గుంటల భూమి విషయంలో గొడవ పడ్డారు. ఈ విషయంలో ఒకరికొకరు పరస్పరం దాడులు చేసుకున్నారు. అన్నదమ్ముల ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి... ముగ్గురికి గాయాలు

బైక్పై నుంచి పడి ఒకరు మృతి చెందారు. ముగ్గురికి గాయాలయ్యాయి.


నరేశ్ (ఫైల్)

కోహెడరూరల్(హుస్నాబాద్): బైక్పై నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కోహెడ మండలంలోని కురెల్ల శివారులో చోటు చెసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామానికి చెందిన బోలుగం నరేశ్(38) కోహెడకు వెళ్లోస్తుండగా కూరెల్ల శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ సంఘటనలో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. మృతుడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కను తప్పించబోయి..

జహీరాబాద్ టౌన్: కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్కు చెందిన షఫి మొగుడంపల్లి మండలం మన్నాపూర్కు చెందిన షహలానీలు పనిమీద మొగుడంపల్లి వెళ్లి తిరిగి జహీరాబాద్కు వస్తున్నారు. మొగుడంపల్లి సమీపంలో బ్రిడ్జి వద్ద రోడ్డుకు అడ్డంగా కుక్కరావడంతో బైక్ను తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు వారిని జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బైక్పై నుంచి కింద పడి గాయాలు


వృద్ధురాలిని అంబులెన్స్లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

సిద్దిపేటరూరల్: బైక్ పైనుంచి వృద్ధురాలు కిందపడిన ఘటనలో తలకు గాయాలయ్యాయి. అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ నవీన్, పైలట్ బాల్రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రావురూకుల ఎక్స్ రోడ్ నుంచి పులూర్లు వైపు కుటుంబ సభ్యుడి బైక్ పై వెళ్తూ చిలకమర్రి సుశీల (70) కిందపడి పోయింది. స్థానికులు 108 అంబులెన్స్కు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరకున్న సిబ్బంది, వృద్ధురాలికి ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఈ ధాన్యం ఎక్కడిది..?

- నార్సింగి రైస్మిల్ నుంచి ఏపీకి తరలింపు
- లారీలో లోడ్ చేసిన 345.20 క్వింటాళ్ల ధాన్యం
- విశ్వసనీయ సమాచారంతో అదుపులోకి తీసుకున్న అధికారులు


నార్సింగిలోని విశాలాక్షి రైస్మిల్

మెదక్జోన్: మెదక్జిల్లా నార్సింగి మండల కేంద్రం నుంచి ఈ నెల 4న రాత్రి ఓ లారీలో 345.20 క్వింటాళ్ల ధాన్యం లోడుతో ఏపీలోని ఈస్ట్ గోదావరి జిల్లా మండపేటకు తరలిస్తున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు తూప్రాన్ పట్టణంలో పౌరసరఫరాల అధికారులు అదుపులోకి తీసుకొని సీజ్ చేశారు. ఈ లారీని సీజ్ చేసి మూడు రోజులు గడిచినా ధాన్యం ఎక్కడిది..? దీనికి సంబంధించిన నిర్వాహకులు ఎవరు? అనే వివరాలను సంబంధిత అధికారులు గోప్యంగా ఉంచుతున్నారే తప్పా బహిర్గతం చేయడం లేదు. మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు పూర్తయిన అనంతరం అధిక లాభాల కోసం ఇలా బ్లాక్ మార్కెట్ దందాకు తెరలేపారు. ఈ క్రమంలో కొందరు రైస్మిల్లర్స్ చేయని తప్పే లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని నిర్వాహకులతో కుమ్మక్కై క్వింటాల్కు 5కిలోల నుంచి 10 కిలోల వరకూ అధిక తూకం వేసి రైతులను నిండాముంచిన దాఖలాలు కోకొల్లలుగా ఈ సంవత్సరం బహిర్గతమయ్యాయి. అంతేకాకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపించాకా ట్రక్షీట్లలో ఒక్కో లారీకి 5 నుంచి 10 క్వింటాళ్ల వరకు ధాన్యం తక్కువగా వచ్చిందని రైతులను మోసం చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ విషయంపై రైతులు కలెక్టరేట్కు వచ్చి ఆందోళనలు చేసినా పట్టించుకున్న నాథుడే లేరు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క మెదక్ జిల్లాలోనే ఈ దోపిడీ అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం రైస్మిల్లర్ల యజమానులకే వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి మిల్లర్ల దోపిడీని అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

> **విచారణ చేస్తున్నాం..**
>
> ఈ నెల 4న ధాన్యంతో పట్టుబడిన లారీలో 345.20 కింటాళ్ల ధాన్యం పట్టుకున్నాం. ఇందులో విశాలక్షి రైస్మిల్లుతో పాటు మరో రెండు మిల్లుల ధాన్యం ఉన్నట్టు తెలిసింది. పూర్తిస్థాయిలో విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తాం
>
> – శ్రీనివాస్, డీఎస్ఓ, మెదక్